క్లుప్తంగా

నేడు వీఎంసీ పీజీఆర్ఎస్

పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగర వాసులకు వీఎంసీ కల్పించే మౌలిక వసతుల్లో నెలకొనే సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదులు-పరిష్కార కార్యక్రమం(పీజీఆర్ఎస్) వీఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు నగరంలోని మూడు సర్కిళ్లలోనూ నిర్వహిస్తున్నామని కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చిట్టినగర్‌లోని సర్కిల్-1 కార్యాలయంలో, సత్యనారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయంలో, పటమటలోని సర్కిల్-3 కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినతులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఆయా కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు, ఇతర విభాగాల అధికారులు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని చెప్పారు. నగర వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శాలివాహనుల సమస్యల పరిష్కారానికి చర్యలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కుమ్మర, శాలివాహనుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారి అభివృద్ధి, సంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటానని రాష్ట్ర కుమ్మర, శాలివాహన ఫెడరేషన్ చైర్మన్ పేరేవి ఈశ్వర్ హామీ ఇచ్చారు. గాంధీనగర్‌లోని హోటల్ ఐలాపురంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాలివాహన సంఘం రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ, కుమ్మర శాలివాహన రాష్ట్ర అధ్యక్షులు ఐలాపురం వెంకయ్య అధ్యక్షత వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కుమ్మర శాలివాహన సంఘీయులంతా ఏకతాటిపైకి సంఘటితంగా ఉండి సంఘీయుల అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. జీవోనంబరు 310 కారణంగా అనేక సమస్యలు ఉన్నాయని సంఘీయులు తనదృష్టికి తెచ్చారన్నారు. ఇటుకల తయారీకి అవసరమైన మట్టి గతంలో చెరువుల ద్వారా ఉచితంగా తీసుకువెళ్లే అవకాశం ఉండగా, ప్రస్తుతం ఆ విధానం అమలు చేయకపోవడంతో కులవృత్తులు వీడాల్సిన దుస్థితి ఏర్పడిందనే సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు. అనంతరం ఫెడరేషన్ చైర్మన్ పేరేవి ఈశ్వరయ్యను ఐలాపురం వెంకయ్య, కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. సమావేశానికి జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ఆడి కృత్తిక మహోత్సవం



విజయవాడ కల్చరల్: నగరంలోని కంచికామకోటి పీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆడి కృత్తిక ఉత్సవాన్ని వేద పండితులు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు కావడి సేవలో పాల్గొన్నారు. దేవాలయ కార్యనిర్వాహకుడు డాక్టర్ రామ్మోహనరావు మాట్లాడుతూ కృతిక మహోత్సవం సందర్భంగా అన్ని సుబ్రహ్మణ్యస్వామి దేవాయాల్లో ప్రత్యేక పూజలు చేస్తారని, సంతానం లేని వారు కావాడి సేవలో పాల్గొంటే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసమని వివరించారు. దేవాలయంలో భక్తులకు అన్ని రకాల సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. వివరాలకు దేవాలయంలోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మేనేజర్ శర్మ పాల్గొన్నారు.

హామీలు ఇచ్చి మోసం చేయడం చంద్రబాబుకు అలవాటే

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నేతలు

పాయకాపురం(విజయవాడరూరల్): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని మాజీఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లాది విష్ణు మండిపడ్డారు. 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' కార్యక్రమంపై పాయకాపురం ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో ఆదివారం క్లస్టర్-3 పరిధిలోని డివిజన్ నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ప్రజలకు ఇచ్చి హామీలను అమలుచేయకుండా కూటమి పాలకులు సాగిస్తున్న మోసపూరిత పాలనపై నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకపోవడం దారుణమన్నారు. సీఎం చంద్రబాబు తన జీవితంలో ఎప్పుడు నిజం చెప్పలేదని విమర్శించారు. ఎన్నికలకు ముందు హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం చంద్రబాబుకు అలవాటేనన్నారు.

ప్రజలపై రూ.18వేల కోట్ల భారం...

విద్యుత్ చార్జీలు పెంచబోమని అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రజలపై రూ.18వేల కోట్ల రూపాయల భారం మోపిందన్నారు. లంచాలు ఇవ్వనిదే కులధృవీకరణ సర్టిఫికెట్లు, రేషన్ కార్డులు కూడా మంజూరు కావడం లేదన్నారు. సెంట్రల్ నియోజవర్గంలోని ప్రజానీకం కూటమి ప్రభుత్వంలో వందల కోట్ల రూపాయలు నష్టపోయిందన్నారు. నగరంలో పారిశుద్ధ్య పరిస్థితి అధ్వానంగా ఉందని, వీఎంసి కమిషనర్ ఉన్నారా? లేరా? అన్నట్లు పరిస్థితి ఉందన్నారు. కాపు కల్యాణ మండపం, రాజరాజేశ్వరిపేట ఫ్లైఓవర్, పోలీసుస్టేషన్, ట్రాఫిక్ పోలీసుస్టేషన్లను వైఎస్సార్ సీపీ నిర్మించి ప్రారంభిస్తే.. వాటిని టీడీపీ ఎమ్మెల్యే పునఃప్రారంభించడం సిగ్గుచేటని విమర్శించారు. కూటమి ప్రభుత్వం లక్షలాది కోట్లను అప్పులు చేస్తుందే తప్ప, ప్రజలకు ఇచ్చిన హామీలను మాత్రం నెరవేర్చడం లేదన్నారు. అప్పులు చేస్తున్న డబ్బంతా ఎటుపోతోందని ప్రశ్నించారు. 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని సోమవారం నుంచి రెండువారాలపాటు డివిజన్‌స్థాయిలో నిర్వహించనున్నట్లు వివరించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కూటమి పాలకులు చేస్తున్న మోసాలను నియోజకవర్గంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. డిప్యూటీ మేయర్ అవుతు శైలజ మాట్లాడుతూ కూటమిపాలన లంచాలమయమైందన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారని గుర్తుచేశారు. క్లస్టర్ ఇంచార్జి పసుపులేటి యేసు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బీహెచ్ఎస్‌వీ జానారెడ్డి, యర్రగొర్ల తిరుపతమ్మ, అలంపూర్ విజయలక్ష్మి, రాష్ట్ర మహిళా కార్యదర్శి మేడేపల్లి ఝాన్సీరాణి, రాష్ట్ర కార్యదర్శి పేరం త్రివేణిరెడ్డి, నియోజకవర్గ మహిళా కార్యదర్శి తోపు వరలక్ష్మి, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడు రవిచంద్ర, సిరిశెట్టి రాజా, యరగొర్ల శ్రీరాములు, అలంపూర్ విజయ్, మైనార్టీ కార్యదర్శి షేక్ మస్తాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవీ పూర్ణచందుకు సాహితీ పురస్కారం



విజయవాడ కల్చరల్: ప్రముఖ సాహితీవేత్త, కృష్ణా జిల్లా రచయితల సంఘం, ప్రపంచ తెలుగు రచయితల సంఘం ప్రధానకార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందుకు విశాలాక్షి సాహితీ పురస్కారం లభించింది. విశాలాక్షి సాహిత్య పత్రిక వార్షికోత్సవం సందర్భంగా నెల్లూరు పురమందిరంలో ఆదివారం జరిగిన సభలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. సాహిత్యరంగంలో విశేషమైన సేవలను అందించిన వారికి ఈ పురస్కారాన్ని అందజేస్తారు. పురస్కార గ్రహీత జీవీ పూర్ణచందు మాట్లాడుతూ నెల్లూరులో తిక్కన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని తెలుగుభాషా వికాసానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్, విశాలాక్షి సాహిత్య పత్రిక సంపాదకుడు ఈతకోట సుబ్బారావు, ఆనం రమణారెడ్డి, కోసూరు రత్నం పాల్గొని పూర్ణచందును అభినందించారు.

వృద్ధాప్యం శాపం కాకుండా చూడాలి

ఈగల్ ఎస్పీ నగేష్‌బాబు



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఈగల్ ఎస్పీ కూచిపూడి నగేష్‌బాబు, దాతలు, ట్రస్టీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వృద్ధాప్యం అనేది ప్రతీఒక్కరి జీవితంలో ఒక భాగం అని..అటువంటి వృద్ధాప్యం శాపంగా కాకుండా చూస్తున్న వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ సేవలు నిరుపమానమని ఈగల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కూచిపూడి నగేష్‌బాబు పేర్కొన్నారు. దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో ఆదివారం వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన దాత సోలంకి హార్డ్‌వేర్ అధినేతలు అరవింద్, విక్రమ్, మహవీర్ కుమార్ సహకారంతో వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా నగేష్ బాబు మాట్లాడుతూ 217 నెలలుగా క్రమం తప్పకుండా వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేయడం అభినందనీయమన్నారు. ఇంత మంచి కార్యక్రమంలో పాల్గొనడం తనకు సంతోషంగా ఉందన్నారు. ప్రతిఒక్కరూ తల్లితండ్రులను బాగా చూసుకుంటే వారి పిల్లలు కూడా వారిని బాగా చూసుకుంటారని విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. నేడు ప్రతిఒక్కరూ తమ పిల్లలపై చూపిస్తున్న శ్రద్ధ, తల్లితండ్రులపై కూడా చూపించాలని కోరారు. ట్రస్ట్‌కు అవసరమైన సహాయ సహకారం అందిస్తానని వివరించారు. ప్రముఖ వైద్యుడు టీవీ మురళీ కృష్ణ మాట్లాడుతూ వృద్ధులకు నిత్యావసర సరుకులతోపాటు క్రమం తప్పకుండా ప్రతినెలా వైద్యపరీక్షలు చేయిస్తూ మందులు అందించడం అభినందనీయమంటూ ట్రస్ట్ సభ్యులను అభినందించారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్‌చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో సహకారం అందిస్తున్న దాతలు, ట్రస్టీలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ట్రస్టీలు తట్టి అర్జునరావు, అమరా ఉమామహేశ్వరరావు, ఎన్‌వీయూ సతీష్‌కుమార్, పి.లక్ష్మీనరసింహారావు, వెంకటేష్ గోదావరి తదితరులు పాల్గొన్నారు.

మొల్ల రామాయణ పద్య కావ్యం అజరామరం



మొల్ల విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఐలాపురం వెంకయ్య, శాలివాహనసంఘు నేతలు



మొల్ల విగ్రహావిష్కరణలో పాల్గొన్న డీసీపీ సరిత, ఈశ్వర్ తదితరులు

మొల్ల విగ్రహాన్ని ఆవిష్కరించిన ఐలాపురం వెంకయ్య

భవానీపురం(విజయవాడపశ్చిమ): సహజ పాండిత్యంతో మొల్లమాంబ రచించిన మొల్ల రామాయణం పద్య కావ్యం చరిత్రలో అజరామరంగా నిలిచిపోయిందని మాజీ శాసనమండలి సభ్యులు ఐలాపురం వెంకయ్య తెలిపారు. విద్యాధరపురం శాలివాహన సంఘం ఆధ్వర్యంలో స్థానిక రామమందిరం సెంటర్‌లో ఏర్పాటు చేసిన రచయిత్రి, కవి ఆతుకూరి మొల్లమాంబ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తమ కుల ఆడపడుచు మొల్లమాంబ విగ్రహాన్ని ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. మొల్లమాంబ తన రచన ద్వారా తెలుగు కుటుంబాన్ని రామాయణానికి అన్వయించారని చెప్పారు. అందులోని భాష తెలుగుదనంతో నిండి ఉంటుందని తెలిపారు. తెలుగు కావ్య క్షేత్రంలో తొలి పద్య కవయిత్రి ఆతుకూరి మొల్ల అన్నారు. విజయవాడ డీసీపీ (అడ్మిన్) కేజీవీ సరిత మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి, ధార్మిక జీవన విధానానికి దర్పణంగా నిలిచిన వాల్మీకి విరచితమైన శ్రీమద్రామాయణాన్ని ఆధారంగా చేసుకుని తేట తెనుగులో రాయబడిన పద్యకావ్యం మొల్ల రామాయణమన్నారు.

అందులోని గద్యపద్యాలలోని భాషా సాహిత్య సౌరభాన్ని ఆఘ్రాణిస్తే దేశీ పదసంపదకు సంస్కృత పాటవాన్ని మేళవించిన విషయం అర్థమవుతుందని వివరించారు. మొల్ల రామాయణంలోని సమాజ చిత్రణ చాలా వరకు తెలుగు లోగిళ్లలోని సహజ స్థితిని తెలియ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీ శాలివాహన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఐలాపురం భాస్కర శ్రీనివాస్, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ ఐలాపురం రాజా, శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షులు బొమ్మిన శ్రీనివాసరావు, నగర అధ్యక్షులు భర్తవరపు దుర్గాప్రసాద్, ఏపీ కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్, విగ్రహ దాత పి.కరుణాకర్ వడయార్, బాడిశ రూపేష్, బాడిశ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో విస్తృత సేవా కార్యక్రమాలు



వాకర్స్ బులిటెన్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆరోగ్యం కోసం ప్రతిఒక్కరూ వాకర్స్ క్లబ్‌లను వినియోగించుకోవాలని ఇంటర్నేషనల్ వాకర్స్ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి సూచించారు. డాక్టర్ వైఎస్ బాబు ప్లాజాలో ఆదివారం ఎన్టీఆర్ జిల్లా వాకర్స్ క్యాబినెట్ మూడో సమావేశాన్ని డాక్టర్ ఎక్కటి సుధాకర్‌బాబు అధ్యక్షత నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభావతి మాట్లాడుదూ ప్రతిరోజూ నడక, శారీరక వ్యాయామంతో ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. డాక్టర్ వైఎస్ బాబు ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్య అన్నదానం కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా వాకర్స్ చే స్తున్న సేవా కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. సభకు అధ్యక్షత వహించిన జిల్లా గవర్నర్ ఎ.విజయలక్ష్మి మాట్లాడుతూ వాకర్స్ సేవలలో ప్రతీఒక్కరినీ భాగస్వాములను చేయాలని సూచించారు. అనంతరం యోగాంధ్ర, వేసవిలో మజ్జిగ పంపిణీలో పాల్గొన్న క్లబ్ అధ్యక్షులను ఘనంగా సత్కరించారు. తొలుత వాకర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి ఆళ్వార్ దాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వాకర్స్ జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.పుష్పలత, కోశాధికారి టి.వి.బాలాజీ, ఎక్కటి దుర్గాపావని, కొండాయగుంట రాము వాకర్స్ సీనియర్ నాయకులు, క్లబ్‌ల అధ్యక్షులు, డెపూగవర్నర్లు, సభ్యులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తి వీడకుంటే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ వాసిరెడ్డి శ్రీను

మధురానగర్(విజయవాడసెంట్రల్): పాత నేరస్తులు, రౌడీ షీటర్లు నేరప్రవృత్తిని వీడాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీను హెచ్చరించారు. స్థానిక గుణదల పోలీసే స్టేషన్‌లో ఆదివారం పాత నేరస్తులు, రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్తుల కదలికలపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతూ ఉంటుందన్నారు. నేరం చేసిన వారు పోలీసుల నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. నేర ప్రవృత్తి వీడి.. మంచి నడవడిక అలవర్చుకోవాలని సూచించారు. ఎక్కడైనా నేరం జరుగుతున్నట్లు తెలిస్తే సదరు సమాచారాన్ని పోలీసులకు ఇవ్వాలన్నారు. నేరాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేర రహిత సమాజ స్థాపనకు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రైటర్ సంతోష్, గుణదల పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు కార్పొరేట్లకు కట్టబెట్టడం తగదు



పాతబస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు సీహెచ్ బాబూరావు, నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడలోని పాత బస్టాండ్(గవర్నర్‌పేట-2) స్థలాన్ని లులూ కంపెనీకి కట్టబెట్టడం వెనుక పెద్ద కుట్ర, కుంభకోణం దాగి ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు ఆరోపించారు. ఏపీఎస్ఆర్టీసీకి చెందిన వందలాది కోట్ల రూపాయల విలువైన స్థలాన్ని బడాకంపెనీలకు కట్టబెట్టడానికి వీల్లేదని, ఆభూమి పరిరక్షణకు రాజకీయాలకు అతీతంగా ఉద్యమిస్తామని పేర్కొన్నారు. ఆర్టీసీ పాతబస్టాండ్ స్థలాన్ని లులూ కంపెనీకి ఇవ్వొద్దని.. ప్రజా ప్రయోజనాలకే వినియోగించాలని కోరుతూ పాతబస్టాండ్ వద్ద ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కార్పొరేట్ కంపెనీ లులూకు విలువైన ఆర్టీసీ స్థలాలను కట్టబెట్టవద్దని, ప్రజాప్రయోజనాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం డౌన్ డౌన్ అంటూ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈసందర్భంగా బాబూరావు మాట్లాడుతూ విజయవాడ నగరంలో అత్యంత విలువైన పాతబస్టాండ్, విద్యాధరపురం ఆర్టీసీ స్థలాలను లులూ కంపెనీకి కట్టబెట్టాలన్న నిర్ణయంపై కూటమి ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. స్థలాన్ని లులూకు కేటాయించకుండా నగరానికి చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించాలని కోరారు. విలువైన స్థలాలను దారాధత్తం చేస్తుంటే ప్రజాప్రతినిధులు మౌనంగా ఉండటం సరికాదన్నారు. ప్రజల తరఫున తమవాణి వినిపించాలని డిమాండ్ చేశారు. రూ.400 కోట్ల విలువైన స్థలాన్ని బడాకంపెనీలకు సీఎం చంద్రబాబు కట్టబెట్టడంలో పెద్ద కుట్ర దాగి ఉందని మండిపడ్డారు. విజయవాడలో ఒక వైపు మెట్రో రైలు వేస్తాం...ప్రజారవాణా వ్యవస్థను మెరుగుపరుస్తామంటూ ప్రైవేటు భూములను తీసుకునేందుకు యత్నిస్తున్న కూటమి ప్రభుత్వం, ప్రభుత్వ భూములను అత్యంత కారుచౌకగా ప్రవేటు సంస్థలకు ఎలా కట్టబెడుతుందని ప్రశ్నించారు. విలువైన స్థలాలను కార్పొరేట్లకు కట్టబెట్టే నైతికహక్కు కూటమి ప్రభుత్వానికి లేదన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లు, డిపోలను మూసివేసి బడాకంపెనీలకు ఎలా ఇస్తారన్నారు. ఇదేనా పీ4 అంటే అంటూ నిలదీశారు. విద్యుత్ రంగాన్ని ఆదానీ కంపెనీకి, ఆర్టీసి స్థలాలను లులూ కంపెనీకి ధారదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాధ్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం భూ పందేరాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీపీఎం నాయకులు భూపతి రమణారావు, బోయి సత్యబాబు, పి.కృష్ణ, నాయకులు ఇ.వి.నారాయణ, కె.దుర్గారావు, బత్తుల చిన్నారావు, కోరాడ రమణ, ఎన్.గేశ్వరరావు, మురహరి, సూరిబాబు తదితరులు పాల్గన్నారు.

అంబేడ్కర్ భావజాలం స్ఫూర్తిదాయకం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తి కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు

విజయవాడ కల్చరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావజాలం స్ఫూర్తిదాయకమని కళాపోషకుడు దుద్దిళ్లపాటి గోపాలకృష్ణసాయి పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంస్కృతిక - సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై ఆదివారం అంబేడ్కర్ స్ఫూర్తి సభ, సినీ సంగీత విభావరి నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గోపాలకృష్ణసాయి మాట్లాడుతూ భారత జాతి గర్వించతగిన వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. ప్రోగ్రాం కన్వీనర్ బీవీ వీరభద్రరావు మాట్లాడుతూ అంబేడ్కర్ సేవా సంస్థ ద్వారా యువతను చైతన్య పరిచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రంగస్థల నటుడు అశోక్ ఆనంద్ మాట్లాడుతూ సినీ సంగీత విభావరిలో ట్రాక్ మీద కాక ఆర్కెస్ట్రా మీద నిర్వహించాలని సూచించారు. సంస్థ నిర్వాహకులు కే డేవిడ్‌రాజు, ఆదిరాల జయప్రభు, మారేపల్లి జోషి, యూవీ రత్నం, చింతకాయల చిట్టిబాబు పాల్గొన్నారు. గాయనీ గాయకులు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం



కళాశాల వార్షికోత్సవంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ చారులత, అధ్యాపకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దక్షిణ భారత హిందీ ప్రచార సభ హిందీ బిఇడీ కళాశాల వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీనియర్ హిందీ ప్రచారక్ రేపాక రఘునందన్ మాట్లాడుతూ హిందీ భాష నేర్చుకుంటే అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. హిందీకు ఉపాధి అవకాశాలు సైతం అధికంగా ఉన్నాయని అన్నారు. ముఖ్యవక్త రాజస్థానీ హిందీ మీడియం హైస్కూలు ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్‌శర్మ మాట్లాడుతూ మంచి సత్ప్రవర్తన కలిగిన ఉపాధ్యాయులుగా తయారుకావాలని సూచించారు. సమాజానికి గురువు మార్గదర్శకులని, అటువంటి గురువులు కాబోతున్న మీరు విద్యార్థులకు మంచి దిశానిర్దేశం చేయాలని సూచించారు. ప్రత్యేక అతిథి దక్షిణ భారత హిందీ ప్రచార సభ విజయవాడ మేనేజర్ సంధ్యారాణి, హిందీ బిఇడీ కళాశాల ప్రిన్సిపాల్ కె.చారులత మాట్లాడుతూ ఇక్కడ నేర్చుకున్న విషయాలను విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో బోధన చేసి మంచి సమాజ నిర్మాణం కోసం పనిచేయాలన్నారు. నవ సమాజ నిర్మాణానికి సంస్కృతి సంప్రదాయ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందిరినీ ఆకట్టుకున్నాయి. అధ్యాపకులు, విద్యార్థి నాయకుడు రఘురాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం!

బెజవాడలో ఆదివారం రాత్రి కుండపోతగా వర్షం కురిసింది. సాయంత్రం నుంచి వాతావరణం చల్లబడి ఆకాశం మేఘావృతమైంది. సాయంత్రం ఏడు గంటల సమయం నుంచి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. వానతో నగరవాసులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కొన్ని ప్రాంతాల్లో మోకాలిలోతులో నీళ్లు నిలిచాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









మ్యాన్‌హోల్ లీకేజీని అరికట్టరూ!



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏలూరు రోడ్డు మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయం సమీపంలోని యూజీడీ మ్యాన్‌హోల్ పొంగుతున్నా అధికారులకు పట్టడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇక్కడ యూజీడీ లీకేజీలు నిత్యకృత్యంగా మారడంతో మురుగురోడ్డుపైకి చేరి దుర్గంధం వెదజల్లుతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. యూజీడీ మ్యాన్‌హోల్ లీకేజీ కారణంగా మాచవరం దాసాంజనేయస్వామివారి ఆలయానికి వచ్చే భక్తులు కూడా ఇబ్బందిపడుతున్నారు. అధికారులు స్పందించి యూజీడీ లీకేజీ సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రావణంలో నిత్య కుంకుమార్చన

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఈనెల 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యే శ్రావణ మాసంలో చిట్టినగర్‌లోని కొత్త అమ్మవారికి నిత్య కుంకుమార్చనలు జరుగుతాయని ఆలయ కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు తెలిపారు. భక్తులు పాల్గొనాలని వారు కోరారు.